సాక్షి విశాఖపట్నం

సోమవారం, 9, అక్టోబర్, 2023



ప్రాథమిక శాస్త్రాలకు ప్రాధాన్యం

భవిష్యత్‌లో ప్రాథమిక శాస్త్రాలకు మళ్లీ ప్రాధాన్యం పెరుగుతుందని డాక్టర్ వై.శ్రీనివాసరావు అన్నారు. 8లో



'డిజిలాకర్'లోనే ధ్రువపత్రాలు

విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను ఇక నుంచి డిజిలాకర్‌లో పొందవచ్చని ఇంటర్ బోర్డు ప్రాంతీయ అధికారి సత్యనారాయణ తెలిపారు. 8లో

పాత గాజువాక లంకా మైదానంలో ప్రతిష్టించిన 117 అడుగుల పంచముఖ మహా గణపతి విగ్రహ నిమజ్జనం నేత్రపర్వంగా సాగింది. 8లో



న్యూస్‌రీల్

ఉక్కు స్టేడియంలో మార్నింగ్ రన్



మార్నింగ్ రన్‌ను ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ మొహంతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లో ఆదివారం మార్నింగ్ రన్ (ప్రభాత్ ఫేరి) ఉత్సాహంగా జరిగింది. స్పెషల్ క్యాంపెయిన్ 3.0లో భాగంగా ఉదయం ఉక్కు స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) డి.కె. మొహంతి జెండా ఊపి ప్రారంభించారు. ఉక్కు స్టేడియం నుంచి సెక్టార్-6 కాంప్లెక్స్, తృష్ణా మైదానం మీదుగా ఉక్కు స్టేడియానికి చేరిన రన్‌లో ఉక్కునగరం వాసులు, వైజాగ్ మారథాన్ అసోసియేషన్ సభ్యులు పలువురు పాల్గొన్నారు. డైరెక్టర్ మొహంతి మాట్లాడుతూ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి, ఫిట్‌నెస్ మెరుగుపరుచుకోవడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. వైజాగ్ మారథాన్ అధ్యక్షుడు బాలకృష్ణ రాయ్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడానికి సహకరిస్తున్న స్టీల్‌ప్లాంట్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్రీడా విభాగం అధిపతి డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ పోర్టుకు విశేష ఖ్యాతి

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ 90వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సాలగ్రామపురంలోని సీతారామ కళ్యాణమండపంలో హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశాఖపట్నం పోర్టు ట్రస్ట్ మాజీ ట్రస్టీ బీసీహెచ్ మసేను హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలోని అన్ని పోర్టులలో విశాఖ పోర్టుకు ఎంతో చరిత్ర ఉందని, ఉద్యోగుల సహకారంతో నేడు ఎంతగానో అభివృద్ధి చెందిందని తెలిపారు. పోర్టును కాపాడుకోవడానికి ప్రతీ ఉద్యోగి ఉద్యమాలు చేయవలసిన సమయం ఆసన్నమైందని మసేను తెలిపారు. ఈ సందర్భంగా సినీ దర్శకుడు కె. వెంకటేశ్వరావును ఘనంగా సత్కరించారు. అనంతరం సత్యహరిశ్చంద్ర నాటకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు చౌదరి అప్పారవు, కార్యదర్శి రాజేంద్రప్రసాద్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సింహాచలంలో ఆర్టీసీ డిపో తనిఖీ



ఉద్యోగులతో మాట్లాడుతున్న ఈడీ రవికుమార్ తదితరులు

సింహాచలం : సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్‌ను ఆదివారం జోన్-1ఎగ్జిక్యూటివ్ సి.రవికుమార్ తనిఖీ చేశారు. బస్‌స్టేషన్‌లో స్టాల్స్, పార్సెల్ పాయింట్ పని విధానాన్ని పరిశీలించారు. సింహాచలం డిపో ఉద్యోగులంతా కార్పొరేట్ శాలరీ డెబిట్ రూపే కార్డు తప్పనిసరిగా తీసుకోవాలని, తద్వారా 85 లక్షల ప్రమాద బీమా, రూ.ఐదు లక్షలు పొందడానికి వీలు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ బి.అప్పలనాయుడు, సింహాచలం డిపో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ తులసి, అసిస్టెంట్ ఇంజినీర్ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఒరిజనల్ మెమోలు పంపిణీ

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఒరిజనల్ మెమోలను కాలేజీల ప్రిన్సిపాల్స్‌కు ఆర్ఐవో రాయల సత్యనారాయణ ఆదివారం పంపిణీ చేశారు. ఈ ఏడాది మార్చి, మే నెలల్లో నిర్వహించిన ఇంటర్మీయెట్ వార్షిక, అడ్వాన్స్ సప్లిమెంటరీలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు షార్ట్ మెమోలను మాత్రమే అందజేశారు. వీటితోనే డిగ్రీ, ఇతర ఉన్నత కోర్సుల్లో విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. అయితే భవిష్యత్ అవసరాలకు ఒరిజనల్ మెమో అవసరం దృష్ట్యా వీటిని విద్యార్థులకు అందించేలా ఇంటర్మీడియెట్ బోర్డు వీటిని ముద్రించి ఆర్ఐవో కార్యాలయానికి సరఫరా చేసింది. ఉమ్మడి విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని 378 కాలేజీల నుంచి పరీక్షలు రాసి, ఉత్తీర్ణులైన విద్యార్థులకు సకాలంలో అందించేలా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీటి పంపిణీ ప్రారంభించామని ఆర్ఐవో సత్యనారాయణ తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ సూపరింటెండెంట్ గణేష్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం వైపు.. వడివడిగా..

- 16 నుంచి ఈవీఎంల పరిశీలన
- రాజకీయ పార్టీల సమక్షంలో నిర్వహణ
- 11న ఈవీఎంల నిర్వహణపై ఎన్నికల సిబ్బందికి శిక్షణ
- 27న డ్రాఫ్ట్ పబ్లికేషన్ తర్వాత అభ్యంతరాల స్వీకరణ
- 'సాక్షి'తో జిల్లా రెవెన్యూ అధికారి మోహన్‌కుమార్



పంపిణీకి సిద్ధంగా ఎపిక్ కార్డులు



సాక్షి, విశాఖపట్నం : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున నేతృత్వంలో అన్ని ప్రక్రియలూ పూర్తి చేసేందుకు వడివడిగా అడుగులు వేస్తున్నామని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌వో) కె.మోహన్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 16 నుంచి ఈవీఎంల పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. తయారీ సంస్థ అయిన బెల్ ప్రతినిధులు, రాజకీయ నాయకుల సమక్షంలో ప్రతి ఈవీఎంనీ క్షుణ్ణంగా పరిశీలించనున్నట్లు వివరించారు. ఈ నెల 27న ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ పబ్లికేషన్ ప్రచురించి అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు 'సాక్షి'తో డీఆర్‌వో మోహన్‌కుమార్ తెలిపారు. ఇంకా ఆయన ఏమన్నారంటే..

20 రోజుల పాటు ఈవీఎంల పరిశీలన

ఫస్ట్ లెవల్ ఈవీఎంల తనిఖీ ప్రక్రియ 16న మొదలు కానుంది. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నవంబర్ 5వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నాం. ఫస్ట్ లెవల్ చెకింగ్‌ని బెల్ కంపెనీ ప్రతినిధులు నిర్వహిస్తారు. ఈవీఎంకి సంబంధించిన బీయూ, సీయూ, వీవీ ప్యాడ్.. మూడు కలిపి ఒకేసారి తనిఖీ చేస్తారు. అన్ని మెషీన్లు కరెక్ట్‌గా పని చేస్తున్నాయని గుర్తించి.. యూనిట్ సంతృప్తికర స్థాయిలో ఉందని ముద్ర వేస్తారు. సమస్యలు గుర్తిస్తే వాటి స్థానంలో కొత్త యూనిట్లను జిల్లాకు కేటాయిస్తారు. ఇటీవలే జిల్లాకు 6 వేల వీవీ ప్యాడ్‌లు వచ్చాయి.

ప్రతి ఈవీఎంతో మాక్ పోలింగ్

ఈవీఎంలను తనిఖీ చేసే క్రమంలో ఎన్నికల ప్రక్రియలో ఓటర్లు ఎలా వ్యవహరిస్తారో.. ఇక్కడ కూడా అదే మాదిరిగా చేపడతాం. మాక్‌పోలింగ్ మాదిరిగా నిర్వహిస్తాం. లోడ్ టెస్ట్ చేస్తాం. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈవీఎంలలో బటన్లు టెస్ట్ చేసి.. ఫైనల్ రిజల్ట్ కరెక్ట్‌గా వస్తుందా లేదా అనేది స్వయంగా పరిశీలించిన తర్వాతే పనిచేస్తుందని ధ్రువీకరిస్తారు. ఈ నెల 11న ఎన్నికల సిబ్బందికి ఈవీఎంలపై శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మల్లికార్జున ఆధ్వర్యంలో నిర్వహించనున్నాం.

జిల్లాకు 6 వేల ఈవీఎం యూనిట్లు

జిల్లాలో మొత్తం 1941 పోలింగ్ స్టేషన్లు గుర్తించాం. ఇందుకు అనుగుణంగా 6 వేల ఈవీఎం యూనిట్లు జిల్లాకు చేరుకున్నాయి. 2 వేల యూనిట్లు పార్లమెంట్‌కు, 2 వేల యూనిట్లు అసెంబ్లీ ఎన్నికలకు వినియోగిస్తాం. మరో 2 వేల యూనిట్లు ట్రైనింగ్, రిజర్వ్‌డ్ పార్ట్‌కు కేటాయిస్తాం.

27కి ఓటర్ల జాబితా డ్రాఫ్ట్ పబ్లికేషన్

స్పెషల్ సమరీ రివిజన్-2024 (ఎస్ఎస్ఆర్)లో భాగంగా ఇంటింటి సర్వే అనంతరం ఓటర్ల జాబితాని సిద్ధం చేశాం. ఈ నెల 27న డ్రాఫ్ట్ పబ్లికేషన్ ప్రచురిస్తాం. అనంతరం నెల రోజుల పాటు అభ్యంతరాలు స్వీకరిస్తాం. ఈ సమయంలో కూడా కొత్త ఓటర్ల నమోదు, మరణించిన వారి ఓట్ల తొలగింపు.. చిరునామాల మార్పు వంటివి కొనసాగిస్తాం. 2024 జనవరి 5న తుది ఓటర్ల జాబితా ప్రచురితమవుతుంది. ఈలోగా పోలింగ్ సిబ్బందికి స్టేషన్ల వారీగా విభజన, పని కేటాయింపు, ఈవీఎంలు సిద్ధం చేయడం కూడా పూర్తవుతుంది.

మూడో విడత ఎపిక్ కార్డుల పంపిణీ

ఎపిక్ కార్డులు ఫస్ట్ ఫేజ్, రెండో ఫేజ్ పంపిణీ పూర్తి చేశాం. శనివారం నుంచి మూడో విడత పంపిణీ ప్రారంభించాం. పోస్టల్ ద్వారా కార్డుల పంపిణీ మొదలైంది. దాదాపు 95 శాతం వరకూ డిస్ట్రిబ్యూషన్ పూర్తవుతుంది. ఎవరైనా చిరునామాలో లేకపోయినా, ఇతర కారణాల వల్ల రిటర్న్ వచ్చినా.. ఆ కార్డులను ఆయా నియోజకవర్గాల పరిధిలోని బీఎల్‌వోలకు అప్పగిస్తాం. వాటిని బీఎల్‌వోలు స్వయంగా ఓటర్లకు అందజేస్తారు.

అందాల మెరుపులు



తిమ్మాపురంలోగల వైజాగ్ ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌లో మిసెస్ వైజాగ్-2023 పోటీలు అలరించాయి. మోడల్స్ ర్యాంప్ వాక్‌తో హొయలొలికించారు. సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించేలా మహిళలు ఆకట్టుకున్నారు. అలాగే విశాఖలోని రాయల్ ప్యాలెస్‌లో జాతీయ స్థాయి అందాల పోటీల ఆడిషన్స్ నిర్వహించారు. - 8లో

వృత్తివిద్యా కోర్సుల్లో ప్రవేశాలు

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి విశాలాక్షి నగర్ దయాల్‌నగర్‌లో దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్‌లో వృత్తి విద్యా కోర్సుల ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఇన్‌స్టిట్యూట్ ఇన్‌చార్జి దక్షిణామూర్తి ఆదివారం తెలిపారు. డ్రెస్ డిజైనింగ్ అండ్ టైలరింగ్ (స్త్రీలకు), టెక్స్ టైల్స్ డిజైనింగ్ అండ్ ప్రింటింగ్ (స్త్రీ, పురుపురుషులు), మోటార్ వెహికల్ మెకానిక్ టూ వీలర్, ఫోర్ వీలర్ (పురుషులు), ఆఫీస్ అసిస్టెంట్ కం కంప్యూటర్ ఆపరేటర్ కోర్సుల్లో శిక్షణ ప్రారంభిస్తున్నామన్నారు. ఇవన్నీ ఏడాది కాలపరిమితి గల కోర్సులని ఆయన తెలిపారు. ఆయా కోర్సుల్లో చేరడానికి పదో తరగతి నుంచి ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైనవారు అర్హులన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఇన్‌స్టిట్యూట్‌లో నేరుగా దరఖాస్తులు అందజేయాలన్నారు. మరిన్ని వివరాలు కోసం 9963340611 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

శునక షోయగం



విశ్వాసానికి మారుపేరైన శునకాల రాజసం అంతాఇంతా కాదు. గంతులేస్తూ పోటీల్లో మస్తు జోష్‌ను నింపాయి. పలు విన్యాసాలు ప్రదర్శిస్తూ సత్తాచాటాయి. ఆదివారం శునకాల ప్రదర్శన అమితంగా ఆకట్టుకుంది. ఎంజీఎం గ్రౌండ్‌లో డాగ్ షో విశేషంగా అలరించింది. డాగ్‌షోలో 45 బ్రీడ్ జాతుల శునకాలు పాల్గొన్నాయి. ఫ్యాషన్ వాక్, గేమ్స్, డ్యాన్సులు చేసి సత్తా చాటాయి. గెలుపొందిన శునకాలకు కిరీటంతో పాటు బహుమతులు అందజేశారు. - 8లో

ట్రాఫిక్ నిబంధనలు కఠినతరం తప్పనిసరి

- వైఎస్సార్‌సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- ఆర్కే బీచ్‌లో రహదారి భద్రతపై అవగాహన



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, చిత్రంలో కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్

బీచ్ రోడ్డు: రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు కఠినతరం చేయాలని వైఎస్సార్‌సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అధికారులకు సూచించారు. ఆదివారం సీఐఐ ఆధ్వర్యంలో ఆర్కే బీచ్‌లో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనచోదకులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రత్యేకంగా సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపే వారిపై జరిమానా విధించాలని, పదేపదే నిబంధనలు ఉల్లంఘిస్తే డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయాలన్నారు.

నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలు సహకరించాలన్నారు. ఎన్‌జీవోలు రహదారి భద్రత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ జిల్లాలో గతేడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది ప్రమాదాల సంఖ్య తగ్గిందన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రహదారి భద్రత సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో తీసుకున్న నిర్ణయాల ప్రకారం 99 ప్రధాన కూడళ్లలో రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేశామన్నారు. రహదారి భద్రత కోసం రూ.21 కోట్ల విలువైన పనులు పూర్తి చేసినట్టు కలెక్టర్ వివరించారు. మరో రూ.7 కోట్ల పనులు త్వరలో పూర్తి చేస్తామన్నారు. జీవీఎంసీ, ఎన్‌హెచ్ఏఐ, ఆర్ అండ్ బీ, రవాణా, పోలీసు శాఖల సమన్వయంతో రహదారి ప్రమాదాలను తగ్గించే దిశగా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు కమిషనర్ రవిశంకర్, డీటీసీ రాజారత్నం, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి

నగర మేయర్ హరివెంకట కుమారి



ర్యాలీ ప్రారంభిస్తున్న మేయర్ హరివెంకట కుమారి

బీచ్‌రోడ్డు: మంచి ఆహార అలవాట్లతోనే క్యాన్సర్ దరిచేకుండా చేయవచ్చని నగర మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. ఆదివారం హెచ్‌సీజీ క్యాన్సర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు స్త్రీల బైక్ ర్యాలీను నిర్వహించారు. ఎంజీఎం పార్క్ నుంచి తెన్నేటి పార్క్ వరకు సాగిన ఈ ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఆధునిక యుగంలో చాలా మంది ఫాస్ట్‌ఫుడ్స్‌కు అలవాటు పడి లేనిపోని అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. హెచ్‌సీజీ క్యాన్సర్ ఆస్పత్రి ఫైండ్ టుడే..ఫైట్ టుడే..విన్ టుమారో అనే వినూత్న కార్యక్రమాలను నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించడం అభినందనీయమన్నారు. రొమ్ము క్యాన్సర్‌ను ముందస్తుగా గుర్తించడానికి మహిళలకు ఉచితంగా మామోగ్రామ్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి సీఈవో డాక్టర్ ఆదిత్య కౌరా తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రతీక్ జైన్, వైజాగ్ మొదటి మహిళా బైకర్ వైశాలి కులకర్ణి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘం తీర్మానం



సమావేశానికి హాజరైన ఉత్తరాంధ్ర జిల్లాల వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగ సంఘ ప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం : దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘం రీజినల్ అధ్యక్షుడు శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఉద్యోగుల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్చించారు. తమ సమస్యలను ముఖ్య అతిథిగా హాజరైన డిస్కమ్ సెక్రటరీ పీకేవీఎం లక్ష్మీరావు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన.. ఉద్యోగుల సమస్యలను డిస్కమ్‌ల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం స్పోర్ట్స్ విభాగంలో విశేష ప్రతిభ కనబరిచిన విద్యుత్ ఉద్యోగులు అన్సర్ అలీ, మాధవ్‌లను శ్రీనివాసరావు సత్కరించారు. ఈ సమావేశంలో విశాఖ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.హరిబాబు, ఎం శ్రీనివాసరావు, జోన్-2 బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు జి.శ్రీనివాసరావు, పి.త్రిమూర్తులు, స్టేట్ కంపెనీ అసిస్టెంట్ సెక్రటరీ రాజబాబు, డిస్కమ్ ట్రెజరర్ బి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సంక్షేమం కోరుతూ ప్రార్థనలు



పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, జేఏసీ నాయకులు

గాజువాక : ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దసరా నుంచి విశాఖ రాజధానిగా పరిపాలన ప్రారంభించనున్నట్టు ప్రకటించిన నేపథ్యంలో గాజువాకలో క్రిస్టియన్లు ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముఖ్యమంత్రికి స్వాగతం పలికేందుకు నాన్ పొలిటికల్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విశాఖకు వందనం కార్యక్రమాల్లో భాగంగా గాజువాక యెహోవా షమ్మా చర్చిలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వెనుకబడ్డ ఉత్తరాంధ్ర ప్రాంతం అభివృద్ధితో పాటు రాష్ట్రంలోని 26 జిల్లాలు అభివృద్ధి చెందాలని, దీనికోసం ముఖ్యమంత్రికి అన్ని మతాల దేవుళ్ల ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. నాన్ పొలిటికల్ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ మాట్లాడుతూ విశాఖను పరిపాలన రాజధానిగా స్వాగతిస్తూ తాము అన్ని ఆలయాల్లో ప్రార్థనలు చేయనున్నట్టు చెప్పారు. ఏపీ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో ఉద్యోగావకాశాల వృద్ధికి విశాఖ అనుకూలమన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు మాట్లాడుతూ వెనుకబడ్డ ఉత్తరాంధ్ర జిల్లాల అభివృద్ధి కోసమే సీఎం విశాఖను పరిపాలన రాజధానిగా ప్రకటించారన్నారు. వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ విశాఖ జిల్లా అధ్యక్షుడు అద్దేపల్లి రవిబాబు, బిషప్ ధనరాజ్, ఏయూ ప్రొఫెసర్ షారోన్ రాజు, నారాయణస్వామి, పాస్టర్లు ధనరాజ్, విజయదాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

16 వరకు జన్మభూమి ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: గుంటూరు డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతా పనుల కారణంగా ఈ మార్గంలో ప్రయాణించే జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేస్తున్నట్లు వా ల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నం-లింగంపల్లి(12805) జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 12 నుంచి 15వ తేదీ వర కు, లింగంపల్లి-విశాఖపట్నం (12806) జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు రద్దు చేశారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రీ షెడ్యూల్

ఛత్రపతి శివాజీ టెర్మినస్ ముంబయిలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు బ యలుదేరాల్సిన ఛత్రపతి శివాజీ టెర్మినస్ ముంబయి-భువనేశ్వర్ (11019) కోణా ర్క్ ఎక్స్‌ప్రెస్ పెయిరింగ్ రైలు రాక ఆల స్యం కారణంగా సాయంత్రం 4.40 గంటలకు బయలుదేరింది. అంతే ఆలస్యంగా ఈ రైలు ఆయా స్టేషన్లకు చేరుకోనుంది.

జూలో ఉత్సాహంగా మారథాన్



విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జూ క్యూరేటర్ నందనీ సలారియా

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో ఈనెల 2న ప్రారంభమైన వన్యప్రాణి వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం హాఫ్ మారథాన్ నిర్వహించారు. ఈ మారథాన్‌లో నగంలో పలు సంస్థలు నుంచి పెద్ద సంఖ్యలో వృద్ధులు, యువతీయువకులు, మహిళలు పాల్గొన్నారు. వారంతా ఉత్సాహంగా మారథాన్‌లో పాల్గొని జూలో సందడి చేశారు. మారథాన్‌లో విజేతలుగా నిలిచినవారికి సర్టిఫికెట్లు, ప్రశంసా పత్రాలను క్యూరేటర్ నందనీ సలారియా అందజేశారు. అనంతరం కోతుల జోన్ ఎదురుగా ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఇటీవల నిర్వహించిన పలు రకాల పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ఆమె అందజేశారు.

శునక షోయగం








బీచ్‌రోడ్డు: దేశ, విదేశీ విభిన్న జాతుల శునకాలతో ఎంజీఎం గ్రౌండ్ కోలాహలంగా మారింది. విశాఖ కెనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన డాగ్ షో నగర ప్రజలను విశేషంగా అలరించింది. షోలో దేశంలోని పలు ప్రాంతాల నుంచి 250 శునకాలను వాటి యజమానులు ఇక్కడకు తీసుకొచ్చారు. ఇందులో 45 బ్రీడ్ జాతుల కుక్కలు ఉన్నాయి. చిట్టి పొట్టి పప్పీలు తెగ ముద్దొచ్చాయి. ముచ్చటైన విదేశీ వెరైటీ శునకాలు చూపు తిప్పుకోనివ్వకుండా ఆకర్షించాయి. షోలో భాగంగా శునకాలు తమ ప్రతిభను చూపిస్తూ.. సువ్వా నేనా అన్నట్లు ప్రదర్శన సాగించాయి. ఫ్యాషన్ వాక్, గేమ్స్, డ్యాన్సులు చేసి సత్తా చాటాయి. గెలుపొందిన శునకాలకు కిరీటంతో పాటు బహుమతులు అందజేశారు.

అందాల పోటీలు అదుర్స్


అందాల పోటీల ఆడిషన్స్‌లో పాల్గొన్న యువతులు

తాటిచెట్లపాలెం: జాతీయ స్థాయి అందాల పోటీల ఆడిషన్స్ అదుర్స్ అనేలా సాగాయి. ఇందుకు స్టేషన్ రోడ్‌లోని రాయల్ ప్యాలెస్ వేదికైంది. రాయల్ ప్యాలెస్, రోటరీ క్లబ్ వైజాగ్ బే వ్యూ సహకారంతో మోంటీ ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో ఆదివారం మిస్ అండ్ మిసెస్ గార్జియస్ ప్లస్ సైజ్ అండ్ టీన్స్ ఆఫ్ ఇండియా– 2023 అందాల పోటీల ఆడిషన్స్ జరిగాయి. కొత్తగా మోడలింగ్‌లో రాణించాలనుకునే వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 50 మంది అమ్మాయిలు ఉత్సాహంగా ఆడిషన్స్‌లో పాల్గొని.. ర్యాంప్ వాక్‌తో అలరించారు. వీరిలో 30 మందిని నిర్వాహకులు తుది విజేతలుగా ప్రకటించారు. ఇంటర్నేషనల్ ఫ్యాషన్ కొరియోగ్రాఫర్స్ అరుణ్ రత్న, లియోన్ ప్రిన్స్‌లచే వీరికి ఉచితంగా శిక్షణ ఇప్పించి ఈ నెల 21న ఫైనల్స్ నిర్వహించనున్నట్లు మోంటీ ప్రొడక్షన్స్ అధినేత మోంటీ తెలిపారు. విశాఖలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు సహకరించిన రైల్వే, రాయల్ ప్యాలెస్ నిర్వాహకులకు, రోటరీ క్లబ్ వైజాగ్ బే వ్యూ ప్రతినిధులు అశోక్ మంధాని, సునీతలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

మిసెస్ వైజాగ్ 'సాక్షి'


అందాల పోటీల్లో పాల్గొన్న శ్రీమతులు


విజేత సాక్షి

కొమ్మాది: శ్రీమతులు చీరకట్టులో తళుకులీనారు. సంప్రదాయానికి ఆధునికతను మేళవించి హొయలు పోయారు. అతివల సోయగాలతో సాగరతీరం మరింత శోభను సంతరించుకుంది. బీచ్‌రోడ్డులోని తిమ్మాపురంలో గల వైజాగ్ ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌లో ఆదివారం మిసెస్ వైజాగ్ –2023 పోటీలు సందడిగా సాగాయి. ఇందులో 26 మంది మగువలు పోటీపడ్డారు. విజేతగా 'సాక్షి' నిలిచింది. ఈ సందర్భంగా కల్చరల్ సెంటర్ అధ్యక్షుడు కాయల వెంకటరెడ్డి మాట్లాడుతూ మిసెస్ వైజాగ్–2023 పోటీలకు విశేష స్పందన లభించిందన్నారు. ఈ పోటీల్లో ప్రథమ విజేతకు శ్రీలంక, ద్వితీయ విజేతకు నేపాల్, తృతీయ విజేతకు గోవా పర్యటనకు పంపిస్తామన్నారు. 2015లో ప్రారంభమైన కల్చరల్ సెంటర్‌లో 1,400 మందికి సభ్యత్వం ఉందన్నారు. కార్యక్రమంలో కల్చరల్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ చైర్మన్ కంటిపూడి వెంకటేశ్వరరావు, డైరెక్టర్ ఎంఎస్ఎన్ రాజు, సహాయ కార్యదర్శి ఎస్. అశోక్‌రెడ్డి, వెంపాడ శ్రీనివాసరెడ్డి, మెహర్ కుమార్, వాసు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

'డిజిలాకర్'లోనే ధ్రువపత్రాలు

- విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి
- ఆర్ఐవో రాయల సత్యనారాయణ

విశాఖ విద్య: విద్యార్థులు అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలను ఇక నుంచి డిజిలాకర్‌లో పొందవచ్చని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి రాయల సత్యనారాయణ తెలిపారు. డిజిలాకర్ వల్ల కలిగే ఉపయోగాలపై ఉమ్మడి విశాఖ జిల్లాలోని జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లకు ఆదివారం విశాఖలోని ఆర్ఐవో కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఇంటర్మీడియట్ బోర్డు ముద్రించిన డిజిలాకర్ వాల్ పోస్టర్లను ఆర్ఐవో ఆవిష్కరించి.. కాలేజీల ప్రిన్సిపాళ్లకు వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి విశాఖ జిల్లాలోని అన్ని కాలేజీల్లో డిజిలాకర్‌పై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలన్నారు. ఒరిజినల్ మార్కుల మెమోలను ఇక నుంచి డిజిలాకర్ ద్వారానే పొందవచ్చన్నారు. విద్యార్థులు కాలేజీలు, కార్యాలయాలు చుట్టూ తిరగాల్సిన పని లేకుండా, తమ వద్ద ఉన్న మొబైల్ ద్వారా వీటిని పొందవచ్చని సూచించారు. ప్రతీ విద్యార్థి తమ మొబైల్‌లో డిజిలాకర్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. దీనిపై కాలేజీల్లో విద్యార్థులకు తగిన అవగాహన కల్పించాలన్నారు. ఒరిజినల్ పాస్ మెమోలు పోగొట్టుకున్నా.. డిజిలాకర్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకుని, వాటిని భవిష్యత్ అవసరాలకు ఉపయోగించవచ్చన్నారు. విద్యార్థులకు ఉపయోకరంగా ఉండేలా ప్రభుత్వం విద్యాశాఖలో డిజిలైజేషన్‌కు ప్రాధాన్యమిస్తోందన్నారు. వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆర్ఐవో కార్యాలయ సూపరింటెండెంట్ గణేష్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

'ప్రపంచ శాంతి.. ఇస్కఫ్ లక్ష్యం'

డాబాగార్డెన్స్: ప్రపంచ శాంతి లక్ష్యంగా ఇస్కఫ్ ముందుకు సాగుతోందని ఆ సంస్థ జాతీయ సమితి చైర్మన్ భానుదేబ్ దత్తా అన్నారు. అల్లూరి విజ్ఞాన భవన్‌లో ఆదివారం జరిగిన ఇస్కఫ్ జాతీయ సమితి ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర దేశాలతో మన దేశంలోని వివిధ ప్రాంతాల మధ్య సాంస్కృతిక సంబంధాలు, స్నేహబంధాలు పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. చైనా, వియత్నాం, క్యూబా తదితర దేశాల నుంచి ప్రతినిధులు కూడా మన దేశానికి వచ్చి ఇక్కడి వారితో స్నేహ సంబంధాలు కొనసాగిస్తున్నారని తెలిపారు. జాతీయ ప్రధాన కార్యదర్శి బిజయ్‌కుమార్ మాట్లాడుతూ యువత ఇస్కఫ్ లీడర్‌షిప్‌లోకి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. నూతన ఆలోచనలతో దేశంలోని అన్ని ప్రాంతాల మధ్య సాంస్కృతిక సత్సంబంధాలు బలోపేతం అవుతున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, ఒడిశా, పశ్చిమబెంగాల్, కేరళ, అసోం, పంజాబ్, బిహార్, ఉత్తరప్రదేశ్, చత్తీస్‌గఢ్, జమ్మూ కశ్మీర్ తదితర రాష్ట్రాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.

వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సేవలు అభినందనీయం


మాట్లాడుతున్న దర్శకుడు మహా వెంకటేష్

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ సొసైటీ ప్రదర్శించిన చిత్రాలను స్ఫూర్తిగా తీసుకుని దర్శకుడిగా మారానని చిత్ర దర్శకుడు మహా వెంకటేష్ తెలిపారు. రేసపువానిపాలెంలో డాక్టర్ ఎల్‌బీ కాలేజ్ ప్రాంగణంలోని గాంధీ సెంటర్‌లో ఆచార్య ఎస్.ఎ.డి పాల్ అధ్యక్షతన ఆదివారం వైజాగ్ ఫిల్మ్ సొసైటీ వార్షిక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖలోని యువత సినీ రంగం వైపు వెళ్లడానికి వైజాగ్ ఫిల్మ్ సొసైటీ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. తన సినీ ప్రయాణానికి విశాఖలోనే తొలి అడుగులు పడ్డాయని.. సామాజిక బాధ్యతతో సినిమాలు తీస్తున్నట్లు చెప్పారు. పూజా కొల్లూరు దర్శకత్వంలో మార్టిన్ లూథర్ కింగ్‌ను ఈ నెల 27న విడుదల చేస్తున్నామని, ఈ సినిమాకు క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా తాను వ్యవహరించినట్లు చెప్పారు. నరవ ప్రకాష్ కోరిక మేరకు విశాఖలో ఫిల్మ్ మేకింగ్ వర్క్‌షాప్ నిర్వహిస్తానని చెప్పారు. డాక్టర్ బాబ్జీ, చాట్ల బాబూరావు, ప్రభు, డాక్టర్ అర్చన, రజనీ కాంత్, హుస్సేన్, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ


భూపేష్‌నగర్ ప్రాంతంలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

అల్లిపురం: నగర ప్రశాంతతే లక్ష్యంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ చర్యలు చేపట్టారు. ఆయన ఆదేశాల మేరకు శనివారం రాత్రి పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో బక్కన్నపాలెం, రెండవ పట్టణ పోలీస్ స్టేషన పరిధిలో భూపేష్‌నగర్, మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో అమర్‌నగర్, సిద్ధార్థనగర్, ఎంవీపీ పోలీస్‌స్టేషన్ పరిధిలో సింహాద్రినగర్, కేఆర్ఎంకాలనీ ప్రాంతాల్లో ఏకకాలంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. సరైన ధ్రువీకరణపత్రాలు లేని 15 ద్విచక్రవాహనాలు, రెండు ఆటోలు, ఓ కారును సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

శాటిలైట్ విజ్ఞానానిదే భవిష్యత్

- డీఆర్‌డీఏ నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్ డైరెక్టర్ శ్రీనివాసరావు
- ముగిసిన అంతరిక్ష వారోత్సవాలు


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న శ్రీనివాసరావు

తగరపువలస: భవిష్యత్‌లో ప్రాథమిక శాస్త్రాలకు మళ్లీ ప్రాధాన్యం పెరుగుతుందని డీఆర్‌డీవో నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు అన్నారు. షార్, ఇస్రో, రఘు విద్యాసంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. దాకమర్రి రఘు ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్టార్టప్ రంగంలో యువత రాణించాలన్నారు. భారత ప్రభుత్వం స్టార్టప్ ఇండియాతో యువతను పారిశ్రామికవేత్తలుగా, ఆవిష్కరణకర్తలుగా తీర్చిదిద్దుతోందన్నారు. అంతరిక్ష ప్రయోగాల విజయాలు, నావిగేషన్, కమ్యూనికేషన్ రంగాలను ప్రభావితం చేసిన విధానం గురించి వివరించారు. దృశ్య మాధ్యమ ప్రసారాలు, టెలిఫోన్‌లో వచ్చిన మార్పులకు కారణమైన శాటిలైట్ విజ్ఞాన ఉపయోగాలపై మాట్లాడారు. శాటిలైట్ విజ్ఞానానిదే భవిష్యత్ అని.. ఇది మానవ జీవన విధానాన్ని మార్చివేసిందన్నారు. షార్–ఇస్రో చీఫ్ జనరల్ మేనేజర్ పి.వెంకటరెడ్డి మాట్లాడుతూ దేశ యువతలో అంతరిక్ష విజ్ఞానం పట్ల ఉత్సాహం, ఆసక్తి పెరిగిందన్నారు. భవిష్యత్తులో మన దేశానికి ఆదాయ వనరుగా అంతరిక్ష పరిశోధన రంగం నిలుస్తుందన్నారు. చంద్రయాన్, ఆదిత్య ప్రయోగాలు భారత అంతరిక్ష పరిశోధన శక్తిని ప్రపంచానికి చాటాయన్నారు. షార్ శాస్త్రవేత్త, విశాఖ రీజియన్ సబ్ కమిటీ చైర్మన్ జి.అప్పన్న మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో చైతన్యం పెంచే దిశగా వారోత్సవాలు నిర్వహించినట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సృజనాత్మకత అబ్బురపరిచిందన్నారు. వారి ఆలోచనలు తమను మరింతగా ఆలోచింపజేశాయన్నారు. వారోత్సవాలను సమర్థవంతంగా నిర్వహించినందుకు రఘు విద్యాసంస్థల చైర్మన్ కలిదిండి రఘును అభినందించి.. షార్ తరపున ప్రశంసాపత్రం అందించారు. రఘు మాట్లాడుతూ వారోత్సవాల్లో భాగమైన షార్ శాస్త్రవేత్తలకు ధన్యవాదాలు తెలిపారు. షార్ ప్రతినిధి హరికృష్ణ, ఎస్ఎస్టీఎల్ శాస్త్రవేత్త ఆర్.వి.ఎస్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

అంతరిక్ష వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన విజ్ఞాన, వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అంతరిక్ష పితామహుడు విక్రమ్ సారాబాయ్ కృషి, లిక్విడ్ స్టేజెస్ ఆఫ్ రాకెట్లు, లూనార్ వెహికల్స్, శాటిలైట్ పనిచేయు విధానం, పనితీరు, రాకెట్ల తయారీ, స్పేస్ మిషన్ వంటివి ఆలోచింపజేశాయి. ముగింపు వేడుకల్లో రఘు విద్యా సంస్థల విద్యార్థిని చేసిన శాస్త్రీయ నృత్యం విశేషంగా అలరించింది.

సీఎం వైఎస్ జగన్‌తో ఆర్టీసీ ఉద్యోగులకు గుర్తింపు

- విలీనంతో ఆత్మగౌరవం పెంపు
- ఎన్ఎంయూఏ రాష్ట్ర అధ్యక్షుడు రమణారెడ్డి


ఎన్ఎంయూఏ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులకు గజమాలతో సత్కారం

మద్దిలపాలెం: పాదయాత్ర సమయంలో ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి, ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని పెంచారని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.రమణారెడ్డి కొనియాడారు. నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్(ఎన్ఎంయూఏ)కు ప్రభుత్వ గుర్తింపు యూనియన్‌గా జీవో జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆదివారం కళాభారతి ఆడిటోరియంలో ఉమ్మడి విశాఖ జిల్లా ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో విజయోత్సవ సభను ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలుపుతూ ఉద్యోగులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.రమణారెడ్డి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ కారణంగా ఆర్టీసీ ఉద్యోగులకు గుర్తింపు లభించిందన్నారు. యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల హృదయాల్లో ముఖ్యమంత్రి సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకున్నారన్నారు. పీఆర్‌సీని కూడా అమలు చేసి మరింత మేలు చేశారన్నారు. ఉద్యోగుల సమస్యలు ఒక్కొక్కటి పరిష్కరించుకునేందుకు మంత్రివర్గ ఉప సంఘం సభ్యుడు, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అందిస్తున్న సహాయ, సహకారాలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. అపరిష్కృతంగా ఉన్న పలు సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. అనంతరం యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పి.వి.రమణారెడ్డి, వై.శ్రీనివాసరావులను ఉద్యోగులు సత్కరించారు. మద్దిలపాలెంలోని ఎన్ఎంయూఏ కార్యాలయం నుంచి పిఠాపురం కాలనీలోని కళాభారతి ఆడిటోరియం వేదికగా జరిగే విజయోత్సవ సభ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు, రాష్ట్ర కోశాధికారి మోహన్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శులు రాజేష్‌కుమార్, రాజు, రామారావు, నరసింగరావు, విజయనగరం జోన్ అధ్యక్షుడు ప్రదీప్, జోనల్ కార్యదర్శి ఎం.వి.ఆర్.మూర్తి, విశాఖ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ, భారీ సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు 'సిటిజన్' ప్రోత్సాహం


ప్రోత్సాహకాలు పొందిన విద్యార్థులతో సొసైటీ డైరెక్టర్ ప్రభాకర్

సీతమ్మధార: సిటిజన్ కో–ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ విశాఖపట్నం బ్రాంచ్ (టీపీటీ కాలనీ) ఆధ్వర్యంలో 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో 95 శాతం మార్కులు సాధించిన షేర్ హోల్డర్స్ పిల్లలకు ఆదివారం ప్రతిభా పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా సొసైటీ డైరెక్టర్ బొల్లిన ప్రభాకర్ మాట్లాడుతూ సిటిజన్ సొసైటీ ఆరు రాష్ట్రాల్లో 42 శాఖల ద్వారా రూ.3,600 కోట్లకు పైగా వ్యాపారం చేస్తోందన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో సభ్యులకు 18 శాతం డివిడెండ్ చెల్లించినట్లు చెప్పారు. 20 ఏళ్లుగా 10వ తరగతి, ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన షేర్ హోల్డర్స్ పిల్లలకు పురస్కారాలు అందిస్తున్నట్లు చెప్పారు. 2022–23 ఏడాదికి షేక్ నడి మున్నీషా, బమ్మిడి తులసి, సరిపల్లి భాగ్యశ్రీ లక్ష్మి, పువ్వుల శ్రేహర్షిన్‌లకు చెరో రూ.10 వేలు, ప్రశంసాపత్రాలు అందజేశామన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఎస్.ఎస్.నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా వ్యాయామ టీచర్ల సంఘ కార్యవర్గం ఎన్నిక

గోపాలపట్నం: జిల్లా వ్యాయామ విద్యా ఉపాధ్యాయుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం గోపాలపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగింది. సంఘ అధ్యక్షుడిగా ఎ.అప్పలరాజు, కార్యదర్శిగా ఎన్.లలిత్ కుమార్, కోశాధికారిగా ఎన్.రామకృష్ణను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పర్యవేక్షకులుగా ఎల్.కన్నారావు, ఎన్.వెంకటరావు, ఎన్నికల అధికారులుగా అడివివరం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఈ.పైడిరాజు, అనంతవరం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కృష్ణకుమార్ వ్యవహరించారు. ఎన్నికల్లో గెలుపొందిన వారికి తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో గాజువాక గణపతి

- ఘనంగా నిమజ్జనోత్సవం
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- రూ.11,00,116కు లడ్డూను దక్కించుకున్న నిర్మల చిన్ని


నిర్మల చిన్నికి లడ్డూ అందజేస్తున్న నిర్వాహకులు

గాజువాక: ఎస్‌వీ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఆధ్వర్యంలో పాతగాజువాక లంకా మైదానంలో ప్రతిష్ఠించిన 117 అడుగుల పంచముఖ మహాగణపతి విగ్రహ నిమజ్జన మహోత్సవం ఆదివారం నేత్రపర్వంగా సాగింది. గత నెల 18న ప్రారంభమైన భారీ గణపతి ఉత్సవాలను 21 రోజులపాటు కొనసాగించిన నిర్వాహకులు ప్రతిష్ఠించిచోటే అనుపోత్సవాన్ని అతివైభవంగా నిర్వహించారు. స్వామికి తొలుత పాలు, నెయ్యి, కుంకుమ, పసుపుతో అభిషేకాలు చేశారు. అనంతరం విగ్రహాన్ని వాటర్ ట్యాంకుల ద్వారా తెచ్చిన నీళ్లతో కరిగించారు. సాయంత్రం ఏడు గంటలకు ప్రారంభమైన అనుపోత్సవం రాత్రి 10 గంటలకు పూర్తయింది. నిమజ్జనోత్సవం అనంతరం మట్టిని సముద్రంలో కలిపారు. అంతకుముందు నిర్వహించిన లడ్డూ వేలం పాట ఉత్కంఠగా సాగింది. నాయకులు కరణంరెడ్డి నర్సింగరావు, ఆళ్ల శివగణేష్, పెనుమత్స నిర్మల చిన్ని లడ్డూను దక్కించుకోవడానికి పోటీ పడ్డారు. చివరకు రూ.11,00,116కు నిర్మల చిన్ని లడ్డూను దక్కించుకున్నారు. గత ఏడాది ఇదే వేదికపై లడ్డూ రూ.9,99,999 పలికిన విషయం తెలిసిందే.

● 117 అడుగుల పంచముఖ మహా గణపతి ప్రపంచంలో ఎత్తయిన గణనాథునిగా రికార్డుల్లోకి ఎక్కాడు. ఇప్పటివరకు ఎత్తయిన గణపతిగా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో మహారాష్ట్రలో బంగారంతో తయారు చేసిన 102 అడుగుల గణేశునికి స్థానం ఉంది. ఇప్పుడు ఆ రికార్డును గాజువాక మహాగణపతి సొంతం చేసుకున్నాడు. వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి వీరుమామ ఇందుకు సంబంధించిన ధ్రువీకరణ పత్రం, బంగారు పతకం, ప్రశంసాపత్రాన్ని ఉత్సవ నిర్వాహకుడు కొసిరెడ్డి గణేష్‌కు అందజేశారు.

రోలర్‌స్కీ నేషనల్ చాంపియన్‌షిప్‌లో విశాఖ సత్తా


విజేతలతో కోచ్ మురళీ, రోలర్‌స్కీ ఫౌండర్ సురేంద్రరెడ్డి

దొండపర్తి: రోలర్‌స్కీ నేషనల్ చాంపియన్‌షిప్‌లో విశాఖ క్రీడాకారులు సత్తా చాటారు. గుజరాత్‌లోని బరోడాలో ఈ నెల 6, 7, 8 తేదీల్లో నేషనల్ చాంపియన్ షిప్ జరిగింది. ఇందులో విశాఖకు చెందిన వి.ఉదయశ్రీ తేజ మూడు బంగారు పతకాలు సాధించగా, ఆర్.చాణక్య రెండు స్వర్ణాలు, ఒక రజతం కైవసం చేసుకున్నారు. జి.నూతన్ మూడు స్వర్ణాలు సాధించారు. కోచ్ మురళీ ఆధ్వర్యంలో ఏపీకి ఓవరాల్ చాంపియన్‌షిప్ దక్కింది. ఏపీ రోలర్ స్కీ ఫౌండర్ సురేంద్ర రెడ్డి ప్రోత్సాహంతో ఈ ఫలితాలు సొంతమయ్యాయని కోచ్ మురళీ తెలిపారు. స్వర్ణ, రజత పతకాలు సాధించిన క్రీడాకారులను సురేంద్రరెడ్డి అభినందించారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

ఏడేళ్ల బాలికపై లైంగికదాడికి యత్నం


నిందితుడు విజయ్ శ్యామ్యూల్ రాజ్

పీఎంపాలెం: మధురవాడ పరిధిలో దారుణ ఘటన చోటు చేసుకుంది. ఏడేళ్ల చిన్నారిపై 64 ఏళ్ల వృద్ధుడు లైంగికదాడికి యత్నించాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటనకు సంబంధించి పీఎంపాలెం సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాలివీ.. మధురవాడ మిథిలాపురి–వుడా కాలనీ ఎన్టీఆర్ హుద్‌హుద్ కాలనీలో బ్లాక్ నంబర్ 4 టీఎఫ్–7లో ఓ కుటుంబం నివసిస్తోంది. భార్య ఓ బ్యాటరీ షాపులో పని చేస్తుండగా.. ఆమె భర్త కంచరపాలెంలోని మందుల షాపులో పని చేస్తున్నాడు. వీరికి మూడో తరగతి చదువుతున్న ఏడేళ్ల కుమార్తె ఉంది. అదే బ్లాకులో ఎస్ఎఫ్–8లో ఎల్లా విజయ్ శ్యామ్యూల్ రాజ్ తన భార్యతో కలసి ఉంటున్నాడు. అదే బ్లాక్‌లో ఎస్ఎఫ్–7ను కూడా అద్దెకు తీసుకున్నాడు. ఈ నెల ఆరో తేదీ సాయంత్రం 8 గంటలకు కూలింగ్ వాటర్ కోసమని విజయ్ శ్యామ్యూల్ రాజ్ ఇంటికి బాలిక వెళ్లింది. పది నిమిషాలు దాటినా బాలిక రాకపోవడంతో తల్లి శ్యామ్యూల్ రాజ్ ఇంటికి వెళ్లింది. ఎస్ఎఫ్ 8 లేకపోవడంతో ఎస్ఎఫ్7 ఉంటున్న ఇంటికి వెళ్లింది. అక్కడ మంచం పై మీద బాలిక పడి ఉంది. ఇంటికి తీసుకొచ్చి ప్రశ్నించగా.. అతను శరీర భాగాలు తాకుతూ అసభ్యకరంగా ప్రవర్తించినట్టు తల్లికి చెప్పింది. దీంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కేసు తదుపరి చర్యలు నిమిత్తం దిశ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశామన్నారు. నిందితుడు విజయ్ శ్యామ్యూల్ రాజ్ గతంలో కూడా ఇటువంటి దురాగతాలకు పాల్పడ్డాడని, అతన్ని కఠినంగా శిక్షించాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు.